క్లుప్తంగా

ఇంద్రజాలికుడు బోస్‌కు సత్కారం



బోస్‌ను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: ప్రముఖ ఇంద్రజాలికుడు, రచయిత మేజిక్ స్టార్ దంతులూరి సత్యనారాయణరాజు(బోస్)ను పాలకొల్లులో ×మేజిక్ ఆచార్య× అనే బిరుదుతో సత్కరించారు. పాలకొల్లు పట్టణానికి చెందిన మాసపత్రిక వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో బోస్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బోస్ మేజిక్ రంగంలో విశిష్ట సేవలందించిన బహుముఖ ప్రజ్ఞావంతుడని కొనియాడారు. కార్యక్రమంలో దుర్గేష్, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు, వంగా నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు భోజనాలు



వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనాలు వడ్డిస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని తాడేరురోడ్డులోని జద్దు బ్రహ్మాజీరావు సూర్యకాంతం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శనివారం ఈది ఫౌండేషన్ ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేశారు. ఫౌండేషన్ చైర్మన్ ఈది రవికుమార్, రాజశేఖర్, కె రవికుమార్, ఏలేటి లాజర్, వర్ధనపు మోషే తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలకు సత్కారం

భీమవరం: రక్తదానం పట్ల అపోహలు విడనాడి ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఎక్కువ పర్యాయాలు రక్తదానం చేసిన బోడపాటి పెదబాబు, కొప్పినీడి బాబీ, కేపీఎల్ నర్సింహారావు, చల్లా రాము, చీడే చందులను ఎమ్మెల్యే సత్కరించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాళ్ల: కాళ్ల మండలం బోస్ కాలనీలో ఉన్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో నూతన 11 కేవీ లైన్ల ఏర్పాటు నిమిత్తం ఆదివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. మాలవాని తిప్ప, గోగుతిప్ప, ఆనందపురం, ఇస్కుల్లంక, మేకలదిబ్బ, గూట్లపాడు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

యోగ రిజిస్ట్రేషన్లు సంతోషకరం

కాళ్ల: జిల్లాలో 8.50 లక్షల మంది యోగ రిజిస్ట్రేషన్లు చేసుకోవడం సంతోషకరమైన విషయమని ఏపీ డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజు, కలెక్టర్ నాగరాణి అన్నారు. శనివారం కాళ్ల మండలం పెదఅమీరంలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగభ్యాసన కార్యక్రమంలో వారు పాల్గొని యోగభ్యాసాలను చేశారు.

ఎక్సైజ్ దాడులు

కాళ్ల: ప్రభుత్వ అనుమతులు లేకుండా అనధికారంగా మద్యం విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆకివీడు ఎక్సైజ్ సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని కాళ్ళకూరు గ్రామంలో శనివారం ప్రొహిబిషనరీ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. అనధికారంగా మద్యం విక్రయిస్తున్న కోలా ఆంజనేయులును అదుపులోకి తీసుకుని, అతని వద్ద 6 క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై వి.కరుణప్రియ తెలిపారు.

ఉపాధి కూలీల వేతన వెతలు

- నాలుగు నెలలుగా కూలీలకు అందని వేతనాలు
- డబ్బులు రాక అవస్థలు పడుతున్న కూలీలు
- నీరుగారుతున్న ఉపాధి హామీ పథకం లక్ష్యం



వేంద్ర అగ్రహారంలో బోదె పూడికతీత పనులు చేస్తున్న ఉపాధి కూలీలు



మొగల్లులో పంట బోదె పనులు చేస్తున్న కూలీలు

పాలకోడేరు: వలసలు నివారించి స్థానికులకు పని కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లక్ష్యం నీరు గారుతోంది. పని చేసినా వేతనాలు నెలల తరబడి చెల్లించకపోవడంతో ఉపాధి కూలీలు నానా అవస్థలు పడుతున్నారు. నియోజకవర్గంలో ఉపాధి కూలీలకు చెల్లించాల్సిన బకాయిలు సుమారు రూ.5 కోట్లకు పైమాటే ఉంటుందని అధికారులు చెబుతుండడంతో ఈ పథకం ఎంత సమర్థవంతంగా అమలవుతుందో తెలుస్తోంది.

బకాయిలు రూ.5 కోట్లకు పైమాటే

ఉండి నియోజకవర్గంలో ఆకివీడు మండలంలో 1,036 మంది, కాళ్ల మండలంలో 803, పాలకోడేరు మండలంలో 1194, ఉండి మండలంలో 1200 మంది మొత్తం 4033 మందికి పైగా ఉపాధి పనులు చేస్తున్నారు. ప్రతి కూలీకి గరిష్టంగా రూ.307 వచ్చేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి జిల్లా అధికారులు సూచించారు. నియోజకవర్గంలో మాత్రం సరాసరి రూ.270 నుంచి రూ.280 వరకే వేతనం లభిస్తోంది. దాదాపు ఒక్కొక్క కూలికి రూ.10 వేల నుంచి రూ.16 వేల వరకు వేతన బకాయిలు చెల్లించాల్సి ఉంది. నియోజకవర్గంలో సుమారు ఉపాధి కూలీల బకాయిలు రూ 5,30,23,000 వరకు చెల్లించాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ఇవి కాకుండా ఉపాధి హామీ పథకంలో భాగంగా పలు అభివృద్ధి పనులు, రోడ్డు పనులు తదితర పనులు చేపట్టారు. వీటి బకాయిలు దాదాపు రూ.3 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఆర్థిక సంవత్సరం ముగిసినా వేతన బకాయిలు విడుదల చేయడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో కూలీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వసతులు కరువు

పని ప్రదేశాల్లో సైతం కనీస వసతులు లేక ఉపాధి హామీ కూలీలు ఎండకు ఎండి, వానకు తడుస్తూ విలవిల్లాడుతున్నారు. వేసవిలో కనీసం టెంట్లు కూడా లేకపోవడంతో కూలీలకు అవస్థలు తప్పడం లేదు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు ఉపాధి పనులు చేస్తుంటారు. ఆ సమయంలో ఎండ తీవ్ర రూపం దాల్చుతోంది. పని ప్రదేశాల్లో విశ్రాంతి తీసుకోవడం కోసం కనీసం నీడ కూడా లేకపోవడంతో కూలీలు వడదెబ్బకి గురైన ఘటనలు ఎన్నో ఉన్నాయి. తాగడానికి మంచి నీరు సైతం అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఎండ తీవ్రతకు డీహైడ్రేషన్‌కు లోనైతే ఓఆర్ఎస్ ద్రావణాలు కూడా అందుబాటులో లేకపోవడం గమనార్హం. అంతేకాకుండా పనులు చేస్తున్న సమయంలో తేనెటీగల దాడి, అప్పుడప్పుడు చిన్న చిన్న దెబ్బలు తగులుతుంటాయి. ఆ సమయంలో ప్రాథమిక చికిత్స చేయడానికి అవసరమైన మెడికల్ కిట్లు కూడా ప్రభుత్వం పంపిణీ చేయడం లేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా సక్రమంగా వేతనాలు చెల్లిచడంతోపాటు, పని ప్రదేశాల్లో వసతులు కల్పించి ఆరోగ్య భద్రతకు చర్యలు తీసుకోవాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు.

కూలి డబ్బులే కుటుంబ పోషణ



ఉపాధి పనులకు వెళితే గతంలో వారం వారం డబ్బులు వచ్చేవి.. దీంతో కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాళ్ళం. ఇప్పుడు బిల్లులు సకాలంలో రాకపోవడంతో రోజురోజుకు కుటుంబ పోషణ చాలా కష్టంగా ఉంది. నాలుగు నెలలుగా వేతనాలు రావాల్సి ఉండగా అరకొర వేతనాలు జమ చేసి మొత్తం చెల్లించేశాం అనడం సరికాదు.

– వెంకట్, మొగల్లు

కూలి డబ్బులు అరకొర వేస్తే ఎలా?



కుటుంబాన్ని పోషించుకుందామని ఉపాధి పనికి వెళ్తున్నాం. గతంలో వారం రోజులకు రెండు వారాలకి కూలి డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ అయ్యేవి. ఇప్పుడు నెలలు తరబడి కూలి డబ్బులు పడడం లేదు. మొత్తం నాలుగు నెలలకు సంబంధించి కూలి డబ్బులు రూ.16వేలు రావాల్సి ఉండగా కేవలం నాలుగు వేలు బ్యాంకు ఖాతాలో జమయ్యాయి. ఇలాగైతే ఎలా ?

– ఎస్ మణి, మొగల్లు

త్వరలోనే జమవుతాయి



ఏప్రిల్ నెల వరకు వేతనాలు బ్యాంకు ఖాతాలో జమవుతున్నాయి. ఇంకా మే, జూన్ మాసాలకు సంబంధించి బకాయిలు రావాల్సి ఉంది. అవి కూడా త్వరలో బ్యాంకు ఖాతాలో జమవుతాయి. ఆలస్యం అవటం వాస్తవమే కానీ కూలీలు అధైర్యపడవద్దు. కూలీలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తాం.

– ప్రకాష్ టెక్నికల్ అసిస్టెంట్, పాలకోడేరు

ఎప్పటికైనా ప్రమాదమే..



భీమవరంలో విస్సాకోడేరు వంతెన వద్ద ఎండిన చెట్టు

భీమవరం: భీమవరం నుంచి పాలకొల్లు వెళ్లే జాతీయ రహదారిలో విస్సాకోడేరు వంతెన వద్ద పెద్ద చెట్టు ఎండిపోయి విద్యుత్ స్తంభంపైవాలి ప్రమాదకరంగా ఉంది. నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు, ప్రయాణికులు ఈ దారిలో రాకపోకలు సాగిస్తుంటారు. ఏ క్షణంలోనైనా ఈ చెట్టు కూలిపోయే ప్రమాదం ఉందని, అంతేకాకుండా విద్యుత్ తీగలకు దగ్గరలో ఎండిన చెట్టు కొమ్మలు ఉండడంతో ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి చెట్టును తొలగించకపోతే ప్రమాదం తప్పని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జూదరుల అరెస్ట్

నరసాపురం రూరల్: యర్రంశెట్టివారిపాలెంలో శనివారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడుల్లో ఐదుగురిని అరెస్ట్ చేసి, 3,900 నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై టి వెంకట సురేష్ తెలిపారు.

యోగాతో శారీరక, మానసిక ప్రశాంతత



భీమవరం కేజీఆర్ఎల్ కళాశాలలో నిర్వహిస్తున్న యోగ



కుముదవల్లిలో యోగా నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: నిరంతర యోగాతో శారీరక, మానసిక ప్రశాంతత లభిస్తుందని భీమవరం వన్‌టౌన్ సీఐ ఎం.నాగరాజు అన్నారు. భీమవరం కేజీఆర్ఎల్ కళాశాల ఆవరణలో శనివారం యోగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ నేటి స్పీడ్ యుగంలో మానవులు అనేక ఒత్తిడులకు గురికావడం తద్వారా అంతుపట్టని వ్యాధులతో సతమతమవుతున్నారని, దీనికి యోగ చేయడంతో పరిష్కారం లభిస్తుందన్నారు. కళాశాల సంయుక్త కార్యదర్శి అరేటి ప్రకాష్, కోశాధికారి గన్నాబత్తుల శ్రీనివాస్ మాట్లాడుతూ నిరంతరం ప్రతిరోజు ఒక గంట యోగాకు కేటాయిస్తే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, కలిగోట్ల గోపాలశర్మ, డాక్టర్ విజయ, కళాశాల ప్రిన్సిపాల్ ఐ.శ్రీరామచంద్రమూర్తి, ఎం.గంగాధరరావు, తోట శ్రీరామ్మూర్తి, కవల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాలకోడేరు: మండలంలోని కుముదవల్లి గ్రామ సచివాలయం వద్ద ఎంపీడీవో వి.రెడ్డియ్య ఆధ్వర్యంలో శనివారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ కనీసం 20 నిమిషాలు యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని, తద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

నాగిడి పాండు మృతి పార్టీకి తీరని లోటు



పాండు రంగారావు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న చినిమిల్లి

భీమవరం అర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నాగిడి పాండురంగారావు మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చినిమిల్లి వెంకట్రాయుడు అన్నారు. భీమవరం మండలంలోని నాగిడిపాలెంలో ఇటీవల అనారోగ్యంతో నాగిడి పాండురంగారావు (65) మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులు బాలకృష్ణ, వీర్లవెంకయ్యలను శనివారం చినిమిల్లి, పార్టీ నాయకులు పరామర్శించారు. నాగిడి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ అండగా ఉంటుందని అధైర్య పడవద్దని నాగిడి కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు జల్లా కొండయ్య, గాదిరాజు రామరాజు, కోడే యుగంధర్, సర్పంచ్ నాగిడి నారాయణస్వామి, నాయకులు తిరుమాని ధర్మరాజు, నాగిడి నాగరాజు, సత్యనారాయణ, గోవిందస్వామి, వెంకటేశ్వరరావు, మోకా గుణేశ్వరరావు, కార్యకర్తలు ఉన్నారు.

వెంకన్నకు మామిడిపండ్ల అలంకరణ

నరసాపురం రూరల్: మండలంలోని మేములదీవి గ్రామం కాపులకొడపలో ఉన్న వేంకటేశ్వరస్వామిని శనివారం మామిడిపండ్లతో ఆలయ అర్చకుడు పెద్దింటి అరుణ్ కుమార్ ఆచార్యులు ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులు స్వామి వారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.

వైభవంగా లక్ష్మీగణపతి హోమం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో సంకట హర చతుర్ధి సందర్భంగా లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. శనివారం ఉదయం ఆలయ అభిషేక పండిట్ భమిడపాటి వెంకన్న బ్రహ్మత్వంలో 15 మంది భక్తులు హోమంలో పాల్గొన్నారు. హోమం అనంతరం భక్తులకు స్వామివారి శేష వస్త్రం, ప్రసాదం అందజేశారు.

అంగన్‌వాడీలో ఆటపాటలతో కూడిన విద్య



గొల్లలకోడేరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది



ఎన్నార్పీ అగ్రహారంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాలకోడేరు: అంగన్‌వాడీల్లో ఆట పాటలతో కూడిన విద్య అందించడం జరుగుతుందని, మూడేళ్లు నిండిన ప్రతి చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి అన్నారు. మండలంలోని గొల్లలకోడేరులో శనివారం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ అంగన్‌వాడీలో చిన్నారులకు అందించే విద్య, సౌకర్యాలు గురించి తల్లులకు అవగాహన కల్పించారు. అనంతరం పిల్లలకు అక్షర అభ్యాసం నిర్వహించి, తల్లులు, అంగన్‌వాడీ టీచర్లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు విజయలక్ష్మి, సోనీ, జెమీమా, భాగ్యలక్ష్మి, నాగలక్ష్మి, పద్మ, సీత పాల్గొన్నారు.

అంగన్వాడీల ద్వారా చిన్నారులకు పరిజ్ఞానం

ఉండి: అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించే ప్రీ స్కూల్ ద్వారా చిన్నారులకు చదువుపై మంచి పరిజ్ఞానం లభిస్తుందని ఐసీడీఎస్ యండగండి సెక్టార్ సూపర్‌వైజర్ వీ నిర్మల అన్నారు. శనివారం ఎన్నార్పీ అగ్రహారంలో నిర్వహించిన అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గ్రామంలో ప్రీ స్కూల్ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన ర్యాలీ నిర్వహించారు.

పట్టణ సుందరీకరణలో మునిసిపాలిటీ నిర్లక్ష్యం



రైల్వేస్టేషన్ రోడ్డులో సెంట్రల్ డివైడర్ మధ్య మొక్కలు లేని దృశ్యం

నరసాపురం: పట్టణం సుందరీకరణ విషయంలో మున్సిపల్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఫలితంగా వనరులన్నీ అందుబాటులో ఉండి కూడా పట్టణ పరిస్థితి దారుణంగా తయారైంది. ఎక్కడ పడితే అక్కడ రోడ్డు పక్కన పిచ్చిమొక్కలు, మట్టి దిబ్బలు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా లాకులు నుంచి కొండాలమ్మ గుడి వరకూ గోదావరి గట్టు వెంబడీ. అలాగే మత్స్యపురి వంతెన నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకూ పంట కాలువ వెంబడి గతంలో ప్లాట్‌పామ్ నిర్మించి రెయిలింగ్ ఏర్పాటు చేశారు. కొండాలమ్మగుడి ప్రాంతంలో మార్బుల్స్ రెయిలింగ్ ఏర్పాటు చేశారు. అధికారులు పట్టించుకోకపోవడం, నిర్వహణ లోపంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా గోదావరి బండ్‌కు వెళ్ళే మార్గంలో నిర్మించిన రోడ్లు ఉపయోగం లేకుండా పోయాయి. రైల్వేస్టేషన్‌రోడ్డులో సెంట్రల్ డివైడర్ల పాతిన మొక్కలు లేకుండా పాడైపోయాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వీటి పరిస్థితిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

బస్టాండ్ సమస్య తీరేదెన్నడు?



పెనుగొండ కళాశాల కూడలిలో బస్సుల కోసం పాట్లు

పెనుగొండ: నిలవడానికి నిలువ నీడ లేక పెనుగొండ కళాశాల కూడలి వద్ద ఇటు యాత్రీకులు.. అటు విద్యార్థులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెనుగొండలో కళాశాల కూడలి వద్ద బస్టాండ్ నిర్మాణం కలగానే మిగిలిపోతుంది. ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఏస్ రాజు విద్యా సంస్థల్లో వేలాది మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ కళాశాలకు తూర్పు గోదావరి జిల్లా రావులపాలెం, గోపాలపురం, పెరవలి మండలాల్లోని పరిసర ప్రాంతాల నుంచి, ఇటు పెనుమంట్ర, ఆచంట, పాలకొల్లు, పోడూరు మండలాల నుంచి నిత్యం వందలాది మంది విద్యార్థులు కళాశాలకు బస్సుల్లో ఉదయం రావడం, సాయంత్రం తిరిగి వెళ్తుంటారు. ఉదయం వేళ నేరుగా బస్సు దిగిదిగగానే కళాశాలకు వెళ్లిపోతారు. సాయంత్రం వేళ కళాశాల ముగియగానే బస్సుల కోసం గంటల తరబడి వేచి చూస్తుంటారు. వీరికి నిలవడానికి కళాశాల యాజమాన్యం చిన్న షెడ్ నిర్మించినా ఇక్కడ పట్టుమని పదిమంది కూడా నిలవలేని పరిస్థితి. దీంతో విద్యార్థులు ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ నానా ఇబ్బందులు పడుతున్నారు.

యాత్రీకులదీ అదే దుస్థితి

వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవారి జన్మస్థలం పెనుగొండ. దీంతో అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కోట్లాది రూపాయల వ్యయంతో వాసవీ శాంతిధాం నిర్మించారు. దీనికి తోడు మూలవిరాట్ వాసవీ కన్యక పరమేశ్వరి కొలువై ఉన్న శ్రీనగరేశ్వర మహిషాసురమర్ధనీ వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవారి ఆలయాన్ని కొయంబత్తూరు భక్తులు తీర్చిదిద్దారు. దీంతో ఆయా ప్రాంతాలను దర్శించుకోవడానికి తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలంగాణా రాష్ట్రాల నుంచి నిత్యం వందలాది మంది భక్తులు వస్తున్నారు. వీరు పాలకొల్లు, తణుకు వరకూ రైళ్లలో వచ్చి, అనంతరం బస్సులో చేరుకుంటున్నారు. తిరిగి వెళ్లేటపుడు కనీస వసతలు ఉన్న బస్టాండు లేకపోవడంతో వారు పడుతున్న వెతలు వర్ణనాతీతం. ఇప్పటికైనా బస్టాండు నిర్మాణం చేపట్టి కనీస వసతులు కల్పించాలని కోరుతున్నారు.